# హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 193 | పేజీలు : 08 | గురువారం | 23-07-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.




## బీజేపీ కార్యాలయం వద్ద
# తీవ్ర ఉద్రిక్తత

**రామచందర్ రావు అరెస్ట్**

- గాంధీభవన్ ముట్టడికి బీజేపీ పిలుపు
- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- దీంతో పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ నిరసనకు దిగిన బీజేపీ నేతలు

2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

గాంధీభవన్ ముట్టడికి బీజేపీ పిలుపు ఇచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో బీజేపీ నేతలు పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు. నేతల అరెస్టుల



# బర్తరఫ్ చేయండి

**ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్**

- ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి:సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్
- ప్రధాని మోదీ జోక్యం చేసుకుని ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి
- యువత హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టీకరణ
- ధర్మేంద్రను తొలగించకుంటే మోదీ రాజీనామా చేయాలన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.ధర్మేంద్ర

## కాంగ్రెస్ చలో లోక్‌భవన్
# ఉద్రిక్తం

- పీసీసీ చీఫ్, మంత్రుల అరెస్ట్
- రాహుల్‌గాంధీ, విపక్షనేతల అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ చలో లోక్‌భవన్
- నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు ర్యాలీ మంత్రులు, కాంగ్రెస్ నేతలను అరెస్టు చేసిన పోలీసులు

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

దిల్లీలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును నిరసిస్తూ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "చలో లోక్‌భవన్" ర్యాలీ స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు చేపట్టిన ర్యాలీని లోక్‌భవన్

# గిగ్ వర్కర్లు, క్యాబ్ డ్రైవర్ల కష్టాలపై కవిత ఆవేదన

- లక్షలాది మంది డెలివరీ వర్కర్లు, ఆటో, క్యాబ్ వర్కర్ల పరిస్థితి దయనీయంగా ఉందన్న కవిత
- ఆదాయం కుటుంబ ఖర్చులకు కూడా సరిపోవడం లేదని ఆవేదన
- వీరంతా నిరసనబాట పట్టే అవకాశం ఉందని హెచ్చరిక

## దేశ వ్యవస్థ అక్రమాలకు
# అడ్డాగా మారింది



- ఈ దశాబ్దంలో 152 పరీక్షల పత్రాలు లీక్ : రాహుల్ గాంధీ
- నీట్ అంశం, ప్రతిపక్షాల ఆందోళనలపై కాంగ్రెస్ ఎంపీ సమావేశం
- శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం దారుణమన్న రాహుల్
- గాంధీ దశాబ్దకాలంలో 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయని వ్యాఖ్య

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా పేరుగాంచిన మన దేశ విద్యా వ్యవస్థ, నేడు అక్రమాలకు నిలయంగా మారిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై లాఠీఛార్జి చేయడం దారుణమన్నారు. అలాగే దశాబ్ద కాలంలో 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయని, 7.50 కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎంత నష్టపోయినా, ఈ ప్రభుత్వం

## దీక్ష విరమణకు
# సిద్ధం

**ప్రభుత్వానికి సోనమ్ వాంగ్‌చుక్ షరతు..**



- ఆమరణ నిరాహార దీక్ష విరమించేందుకు సోనమ్ వాంగ్‌చుక్ సుముఖత
- నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై చర్యలు తీసుకోబోమని హామీ ఇవ్వాలన్న షరతు
- నీట్ వివాదంపై జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న ఆందోళనలు

# బాంబులతో పేల్చేస్తాం



- 'ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ కేంద్రాల్ని బాంబులతో పేల్చేస్తాం':ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్
- ఇరాన్‌కు మరోసారి గట్టి వార్నింగ్ ఇచ్చిన యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్
- ప్రతి దాడికి వంతెన లేదా విద్యుత్ కేంద్రాన్ని ధ్వంసం చేస్తామని వ్యాఖ్యలు
- ట్రూత్ సోషల్‌లో పోస్ట్

హైదరాబాద్ పల్స్,డెస్క్

హర్మూజ్ జలసంధి కేంద్రంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఈ వ్యూహాత్మక జలమార్గంలో రాకపోకలు సాగించే వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడుల్ని తీవ్రతరం చేయడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆ దేశానికి హెచ్చరికలు చేశారు. హర్మూజ్ జలసంధిలో ఏదైనా ఓడపై ఇరాన్ దాడి చేస్తే, దానికి వెంటనే ప్రతీకారం ఉంటుందని, మౌలిక సదుపాయాలపై వైమానిక దాడులు జరుపుతామని స్పష్టం చేశారు. ఇరాన్ ప్రతీ దాడికి బదులుగా టెహ్రాన్‌లోని నేరుగా ఒక ప్రధాన వంతెన లేదా విద్యుత్ ప్లాంట్‌ను అమెరికా బాంబులతో పేల్చేసి, పూర్తిగా ధ్వంసం చేస్తుందని అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్‌లో ట్రంప్ ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌తో

# పార్లమెంటులో నీట్‌పై చర్చిద్దాం..

- నీట్ పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చకు సిద్ధమన్న కిరణ్ రిజిజు
- చర్చతోనే విద్యార్థుల్లో విశ్వాసం పెరుగుతుందని వ్యాఖ్య
- విపక్షాలు షరతులు విధిస్తున్నాయంటే చర్చను కోరుకోవడం లేదని అర్థమని వ్యాఖ్య



# హైదరాబాద్ ప్రజలకు గుడ్‌న్యూస్..

**సొంతింటి కల నెరవేరుస్తాం: మంత్రి పొంగులేటి**

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

నగరంలోని గాంధీభవన్‌లో ప్రతి వారం ప్రజలతో ముఖాముఖి నిర్వహించడం మంచి పరిణామమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల సమస్యలు వినేందుకు ఎలాంటి అవకాశం ఉండేది కాదని విమర్శించారు. పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సొంతింటి కలను తమ ప్రభుత్వం నెరవేర్చుతుందని తెలిపారు.



# బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత

మొదటి పేజీ రువాయి

సందర్భంగా పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. బీజేపీ నాయకుల అరెస్టుపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.కాగా, ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసం ఎదుట మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన చేశారు. దీనికి నిరసనగా బీజేపీ అగ్రనేతలు గాంధీభవన్‌ను ముట్టడించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో హై టెన్షన్ నెలకొంది.

కరీంనగర్‌లో బండి సంజయ్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

ఇక, కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద కూడా ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. కాంగ్రెస్ నేతలను అడ్డుకునే క్రమంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో ఆఫీసు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత కొనసాగింది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. రాష్ట్రంలో ఒకే రోజు బీజేపీ రాష్ట్ర కార్యాలయం, కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఈ పరిణామాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపడుతున్నారు.

# బర్తరఫ్ చేయండి

మొదటి పేజీ రువాయి

ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించలేకపోతే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు తన నియోజకవర్గం నుంచే ప్రతిన బూనుతున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ గాడ్సే వారసత్వానికి ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు.నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాటం సాగించి బీజేపీని ఓడిస్తామన్నారు. యువత భవితవ్యంతో, దేశ భవిష్యత్తుతో మోదీ చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు.నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు ఇతర విపక్షాలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యార్థులు మానసికంగా, విద్యాపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించాలంటే తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలంటూ ఇప్పటికే పలు వర్గాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో లోపాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించి, భవిష్యత్తులో సంస్కరణలు చేపడతామని ప్రకటించినప్పటికీ, విపక్షాలు మాత్రం కేంద్ర మంత్రిపై వేటు వేయాల్సిందేనని పట్టుబడుతున్నాయి.

# హైదరాబాద్ ప్రజలకు గుడ్‌న్యూస్..

మొదటి పేజీ రువాయి

రాష్ట్రంలో ఇప్పటికే 7.5 లక్షల ఇళ్లను మంజూరు చేసి ఇచ్చామని పేర్కొన్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో సొంత ఇల్లు అనేది చాలామందికి కలగానే ఉండేదని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. భూముల ధరలు భారీగా ఉన్న హైదరాబాద్‌లోనూ ప్రజలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

హైదరాబాద్ ప్రజలు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి: మంత్రి

భాగ్యనగరంలో సొంతింటి కోసం అర్హులైన ప్రజలు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు కూడా మరోసారి అప్లై చేసుకోవాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సమస్యల్లో పరిష్కారమయ్యే వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రజలకు చేరువగా పాలన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

# దేశ వ్యవస్థ అక్రమాలకు అడ్డాగా మారింది

మొదటి పేజీ రువాయి

లెక్కచేయట్లేదని మండిపడ్డారు. పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని, డిమాండ్లు పరిష్కరించాలని మాత్రమే యువత కోరుతోందని తెలిపారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. లాఠీఛార్జ్‌లో విద్యార్థులు గాయపడడం సహా వారి ఆక్రందనకు సంబంధించిన దృశ్యాలను మీడియాకు ప్రదర్శించారు.

'అవినీతికి తలుపులు బార్లా తెరిచారు'

కేంద్ర విధానాల వల్ల అంబానీ, అదానీకి ఎలాంటి నష్టం లేదని, కేవలం పేదలు, విద్యార్థులు నష్టపోతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశంలో యువతకు సరైన ఉద్యోగాలు లేవని, దేశంలో తయారీ, వ్యాపార రంగాలు మూతపడ్డాయని, చైనా వస్తువుల సంఖ్య పెరిగిందని దుయ్యబట్టారు. అలాగే, బ్యాంకులను బడా వ్యాపారులు లూటీ చేస్తున్నారని, ఏఐ వల్ల కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సర్కారీ వ్యవస్థలో అవినీతికి తలుపులు బార్లా తెరిచారని ఆరోపించారు. అయితే, విద్యార్థుల ఆందోళనకు కాంగ్రెస్ పూర్తిగా మద్దతిస్తోందని, దానిని రాజకీయాలకు వాడుకోవడం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రజల గళం వినిపించడం తన బాధ్యత అని పేర్కొన్నారు

# దీక్ష విరమణకు సిద్ధం

మొదటి పేజీ రువాయి

నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, తన దీక్షను విరమించేందుకు ప్రభుత్వానికి ఒక షరతు విధించారు. ఈ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ప్రభుత్వం ఎటువంటి కక్షసాధింపు చర్యలు తీసుకోబోమని హామీ ఇస్తే, తాను దీక్షను విరమించడానికి సిద్ధంగా ఉన్నానని బుధవారం ప్రకటించారు."ఈ ఉద్యమంలో పాల్గొన్న యువ నిరసనకారులపై ఎటువంటి శిక్షాత్మక లేదా ప్రతీకార చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ రావాలని నేను గౌరవపూర్వకంగా కోరుతున్నాను. న్యాయబద్ధమైన, జవాబుదారీతనం కలిగిన విద్యా విధానం కోసం గళమెత్తడమే వారు చేసిన ఏకైక 'నేరం" అని కేంద్ర మంత్రులు జె.పి. నడ్డా, జితేంద్ర సింగ్‌లకు రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు.నీట్ అక్రమాలపై జవాబుదారీతనం, విద్యా సంస్కరణలు కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసనల్లో భాగంగా వాంగ్‌చుక్ ఈ దీక్షకు పూనుకున్నారు. దీక్ష కారణంగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఇప్పటికే ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ, ఆయన తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.సీజేపీ నేతృత్వంలో జరుగుతున్న ఈ ఆందోళనల క్రమంలో పోలీసులతో ఘర్షణలు కూడా చోటుచేసుకున్నాయి. విద్యార్థుల సంక్షేమం, పరీక్షల నిర్వహణలో పారదర్శకతను ప్రధాన డిమాండ్లుగా ఈ నిరసనలు కొనసాగుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కూడా ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించే ఉద్దేశంతోనే వాంగ్‌చుక్ ఈ ప్రతిపాదన చేశారు

# పార్లమెంటులో నీట్‌పై చర్చిద్దాం..

మొదటి పేజీ రువాయి

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై పార్లమెంటులో సమగ్రంగా చర్చించేందుకు తాము సిద్ధమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ అంశంపై సభలో పారదర్శకంగా చర్చించడం ద్వారా విద్యార్థుల్లో, వారి తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించవచ్చని ఆకాంక్షించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ కీలక ప్రకటన వెలువడింది.విద్యార్థుల ప్రయోజనాలే తమకు అత్యంత ప్రాధాన్యమని కిరణ్ రిజిజు ప్రకటించారు. పేపర్ లీకేజీ అంశంపై సభలో లోతైన చర్చ జరగాలని తాము కోరుకుంటున్నామని, ఈ సందర్భంగా ప్రతిపక్షాలు తమ అభిప్రాయాలను నిరభ్యంతరంగా వినిపించవచ్చని సూచించారు. అయితే, చర్చకు షరతులు విధించడం అంటే వారు చర్చను కోరుకోవడం లేదనే అర్థం వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం ఏ సమస్య నుంచి పారిపోదని, అన్నిటినీ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తమపై ఉందని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ లేదా అఖిలేష్ యాదవ్ వంటి నేతలు ఎవరైనా ఈ అంశంపై తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చని, అయితే సభా నిబంధనల ప్రకారమే చర్చ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. మరోవైపు, నీట్ పరీక్ష లీకేజీపై చర్చ జరిగే తేదీ, సమయాన్ని నిర్ణయించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని స్పీకర్‌ను ప్రభుత్వం కోరింది.

# కాంగ్రెస్ చలో లోక్‌భవన్ ఉద్రిక్తం

మొదటి పేజీ రువాయి

సమీపంలో పోలీసులు మధ్యలోనే అడ్డుకుని కాంగ్రెస్ ముఖ్య నాయకులను అదుపులోకి తీసుకున్నారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేసి లోక్‌భవన్ పరిసరాలను పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.దిల్లీలో నిన్న రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతల అరెస్టుకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు సంకెళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ర్యాలీని దృష్టిలో ఉంచుకుని నెక్లెస్ రోడ్డు నుంచి లోక్‌భవన్ వరకు పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో మొదలైన ర్యాలీని లోక్‌భవన్ సమీపంలో ప్రధాన కూడలి వద్దే పోలీసులు అడ్డుకున్నారు. ముందే మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు ర్యాలీని నిలిపివేశారు. పోలీసుల అడ్డుకట్టను దాటేందుకు కొందరు కార్యకర్తలు ప్రయత్నించడంతో స్వల్పంగా ఉద్రిక్తత నెలకొంది. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అప్పటికే మోహరించిన పోలీసు బలగాలకు అదనంగా పంజాగుట్ట పోలీసు స్టేషన్ నుంచి సిబ్బందిని, మహిళా కానిస్టేబుళ్లను రప్పించి భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.ఇదే సమయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబీర్ అలీ సహా పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులను నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మిగిలిన నాయకులను పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపటి తరువాత వీళ్లను పోలీసులు విడుదల చేశారు.

# బాంబులతో పేల్చేస్తాం

మొదటి పేజీ రువాయి

ఘర్షణలు మళ్లీ ఉద్ధృతమవుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.'ఇప్పటి నుంచి ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ హర్మూజ్ జలసంధిలో ఏదైనా ఏ ఓడపై అయినా మిసైల్, రాకెట్, డ్రోన్ లేదా ఇతర ఏ ఆయుధంతో అయినా దాడి చేస్తే, అమెరికా వెంటనే ఇరాన్ రాజధాని టెహ్రాన్ నగరంలో లేదా దాని సమీపంలో ఉన్న ఒక వంతెనను లేదా విద్యుత్ ప్లాంట్‌ను బాంబులతో ధ్వంసం చేస్తుంది.' అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కొద్ది రోజుల కిందట యుద్ధ విరమణకు సంబంధించి కుదిరిన తాత్కాలిక ఒప్పందాన్ని లెక్కచేయకుండా ఇరు దేశాలు మళ్లీ భీకర దాడులు చేసుకుంటున్నాయి. దీంతో గల్ఫ్ ప్రాంతంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. గతంలో కూడా ఇరాన్ పౌర మౌలిక సదుపాయాల్ని లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించిన ట్రంప్ ఇప్పుడు మరోసారి అదే వైఖరిని పునరుద్ఘాటించారు. ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు జరిగే హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరగడం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఇప్పటికే క్రూడాయిల్ ధరలు భారీగా పెరుగుతున్నాయని నిపుణులు అంటున్నారు.ఇదిలా ఉండగా అమెరికా సెంట్రల్ కమాండ్ వరుసగా 11వ రాత్రి అయిన మంగళవారం కూడా ఇరాన్ సైనిక స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ప్రకటించింది. వాణిజ్య నౌకల రాకపోకలకు అంతరాయం కలిగించే ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని బలహీనపరచడమే ఈ చర్యల లక్ష్యమని వెల్లడించింది. ఇక్కడ ఇరాన్‌తో దౌత్య చర్చలకు తాము సిద్ధంగా ఉన్నప్పటికీ, ఇరాన్ అంత సీరియస్‌గా లేదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మండిపడ్డారు. అంతర్జాతీయ జలమార్గాలపై ఇరాన్ ఆధిపత్యం చూపించడం లేదా సుంకాల్ని వసూలు చేయడాన్ని అంగీకరిస్తే ప్రపంచవ్యాప్తంగా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయని హెచ్చరించారు.

# గిగ్ వర్కర్లు, క్యాబ్ డ్రైవర్ల కష్టాలపై కవిత ఆవేదన

మొదటి పేజీ రువాయి

స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థల్లో పనిచేస్తున్న లక్షలాది మంది డెలివరీ వర్కర్లు, ఆటో, క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడినా వారికి వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు కూడా సరిపోవడం లేదని అన్నారు. గత మూడేళ్లుగా ఛార్జీలు పెంచాలని అడుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారి పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. అగ్రిగేటర్ సంస్థలు భారీగా కమీషన్ల కోత విధిస్తూ, అన్యాయంగా రేట్లను నియంత్రిస్తుండటంతో డ్రైవర్లు, డెలివరీ బాయ్స్ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నారని తెలిపారు.గిగ్ వర్కర్లు, డ్రైవర్ల పక్షాన ప్రభుత్వం నిలబడాలని, వెంటనే అగ్రిగేటర్ సంస్థలతో చర్చలు జరిపి ఛార్జీలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం వీరంతా 'వర్క్ బ్రేక్ డౌన్' వంటి నిరసనబాట పట్టే పరిస్థితి తెప్పించకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. గిగ్ వర్కర్లు చేస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.



# వృద్ధ అనాథాశ్రమంలో అన్నదానం, పండ్ల పంపిణీ

**టీజేఏ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహణ**

**వృద్ధుల పట్ల మానవతా దృక్పథాన్ని చూపిన టీజేఏ**

**హైదరాబాద్ పల్స్, జూలై 22, మహబూబాబాద్:** తెలంగాణ జర్నలిస్ట్ల అసోసియేషన్ (టి.జే.ఏ.) పన్నెండో ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబాబాద్ జిల్లా శనిగపురంలోని వృద్ధ అనాథాశ్రమంలో హృదయాలను హత్తుకునే సేవా కార్యక్రమాన్ని నిర్వహించింది. బుదవారం జిల్లా అధ్యక్షుడు మేకరబోయిన నాగేశ్వర్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించి, పండ్లను పంపిణీ చేసి వారి యోగక్షేమాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, జర్నలిస్టులు కేవలం వార్తలను ప్రజలకు చేరవేయడమే కాకుండా మానవతా విలువలను కాపాడుతూ సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుల ఆదేశాల మేరకు ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వృద్ధుల పట్ల ప్రేమాభిమానాలు చాటుతూ సేవ అందించిన జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌తో పాటు సంఘ సభ్యులకు ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్టులు సమాజం పట్ల తమ బాధ్యతను కార్యరూపంలో చూపించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌తో పాటు సంఘ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొని వృద్ధులకు స్వయంగా భోజనం వడ్డించి, పండ్లను పంపిణీ చేశారు. సేవాభావం, మానవత్వం, సామాజిక బాధ్యత కలగలిసిన ఈ కార్యక్రమం ఆశ్రమంలో ఆప్యాయతపూరిత వాతావరణాన్ని నెలకొల్పగా,




అక్కడున్న వారందరినీ కదిలించింది. వేడుకలను ఆర్భాటంగా కాకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించిన తెలంగాణ జర్నలిస్టుల సంఘం సమాజానికి ఆదర్శంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో టి.జే.ఏ జిల్లా నాయకులు, జర్నలిస్టులు ఇండ్ల మహేష్, శ్రీనివాస్, గుగులోతు లింగ్య, ఎండి జాకీర్ హుస్సేన్, నల్ల జగన్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'సర్'ను వేగవంతం చేయాలి

**తహసిల్దార్ రమేష్ బాబు**



**హైదరాబాద్ పల్స్, జూలై 22, నర్సింహులపేట :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, నిర్దేశిత గడువులోగా పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని తహసిల్దార్ రమేష్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని కౌసల్యదేవిపల్లి గ్రామంలో కొనసాగుతున్న సర్ ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఓటర్ల నుంచి స్వీకరించిన ఎన్యూమరేషన్ ఫారాల్లో కచ్చితంగా ఓటరు ఫొటో వుండేలా చూడాని, ఓటరు గుర్తింపు కార్డు ఫొటోల డిజిటలైజేషన్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఓటరు జాబితా సవరణ అనేది అత్యంత ప్రాధాన్యం కలిగిన ప్రక్రియ అయినందున సిబ్బంది ఎటువంటి అలసత్వం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేసి వంద శాతం లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బిఎల్ఓ, కారోబార్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్ అక్రమార్కుడు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలి

**20లక్షల విద్యార్థుల జీవితాలతో చెలగాటం**

**తెలంగాణ ఎస్సి జన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయెందర్, వెలిశాల శ్యామ్ మహర్.**

**హైదరాబాద్ పల్స్, సూర్యాపేట, జులై 22 :** నీట్ పేపర్ లీక్ విషయంలో అక్రమార్కుడిగా ఆరోపణలు ఎదుర్కుంటున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలని తెలంగాణ ఎస్సి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయెందర్, రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నిన్నటి కాక్రోచ్ ఆందోళన నేటి రైతుల ఆందోళనను ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశంలో రోజు రోజుకు బిజెపి ప్రభుత్వం విద్యార్థులను, రైతులను ఇబ్బందులకు గురించేస్తుందని అన్నారు. భారత విద్యార్థుల హక్కుల కోసం శాంతియుతంగా నిరసనపై దాడి ప్రజాస్వామ్య స్ఫూర్తిపై జరిగిన తీవ్ర దాడిగా పేర్కొన్నారు ఇది దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిస్థితిపై అనేక ప్రశ్నలను వున్నాయి అన్నారు. నీట్ పరీక్షల వ్యవహారంలో న్యాయం కోరుతూ, కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సింది పోయి ప్రభుత్వం పోలీసుల ద్వారా అణచివేత మార్గాన్ని ఎంచుకుంది.ప్రజాస్వామ్యానికి ఏమాత్రం శోభనీయమైనది కాదు ఈ దేశ ప్రజలకు సమాధానాలు కావాలి. నీట్ పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. దేశ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన ఈ సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వీడి విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనలకు సమాధానం చెప్పాలి. అత్యంత ముఖ్యంగా, నీట్ పరీక్షల సంక్షోభంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరగాలి. కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు




సంబంధించిన ఈ అంశాన్ని విస్మరించే హక్కు ఎవరికీ లేదు. ప్రజల సమస్యలపై చర్చించడానికే పార్లమెంట్ ఉంది. దేశ యువత భవిష్యత్తుకంటే ముఖ్యమైన అంశం మరొకటి లేదు. తెలంగాణ విద్యరుల పక్షాన పూర్తి మద్దతు కాక్రోచ్ జనతా పార్టీకి ఉంటుందని తెలిపారు.

# కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్



**హైదరాబాద్ పల్స్, జూలై 22, నర్సింహులపేట :** మండలంలోని పెద్దనాగారం స్టేజి గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అద్యక్షులు గుగులోతు రమేష్ సోదరి గుగులోత్ నీరజ ఇటివల అనారోగ్య కారణాల వల్ల మృతి చెందారు. బుదవారం బాధిత కుటుంబాని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ బుక్య సోనియా హరిలాల్, సీనియర్ జిల్లా నాయకులు టేకుల యాదగిరి రెడ్డి, సప్పిడి వెంకటరెడ్డి, శేరి రామకృష్ణ, దసురు నాయక్ కొమ్ము అనీల్, బాణాల ప్రవీణ్, సర్పంచ్ మందుల రఘు, మందుల రమేష్, బొబ్బ అశోక్ రెడ్డి, గాడుదుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రిని వెంటనే భర్తరఫ్ చేయాలి...

**ధర్నా చేస్తున్న విద్యార్థులపై దాడి దుర్మార్గం...**

**హనుమకొండలో న్యాయవాదుల నిరసన...**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, యాదాద్రి తెలంగాణ బ్యూరో :** బిజెపి పాలనపై నిరసిస్తూ ప్రజాస్వామ్యయుతంగా ధర్నా చేస్తున్న దేశ విద్యార్థుల మీద ఢిల్లీ పోలీసుల దాడిని ఖండిస్తూ హన్మకొండలో అదాలత్ సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద బుధవారం న్యాయవాదులు నిరసన చేసారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు బైరపాక జయాకర్, పులిసత్యనారాయణ, సాయిని నరేందర్, గంధం శివ, దాక్టర్ జిలుకర శ్రీనివాస్, వలీ ఉల్లా కాద్రీ మాట్లాడారు. మాజీ బార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్ మాట్లాడుతూ... విద్యార్థులు శాంతియుత నిరసన చేస్తే మోడీ ప్రభుత్వం పోలీసులతో విచక్షణారహితంగా దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. నీట్ పేపర్ లేకేజికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాది పులి సత్యనారాయణ మాట్లాడుతూ గత నెల రోజులుగా పోరాడుతున్న విద్యార్థులను తీవ్రవాదులుగా, దేశ ద్రోహులుగా ముద్రవేసి దారుణంగా దాడులు చేయడం సహించరాని నేరమని అన్నారు. దేశంలోని న్యాయవాదులంతా విద్యార్థులకు మద్దతుగా వుండాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ రాజీనామా చేయాలని, విద్యాశాఖ మంత్రిని భర్తరఫ్ చేయాలని గంధం శివ డిమాండ్ చేశారు. ఈ నిరసనలో పాల్గొన్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ... నిరాహర దీక్ష చేస్తున్న వాంగ్ చుక్, నిరసన చేస్తున్న విద్యార్థులతో బేషరతుగా నరేంద్ర మోడీ, అమితాషాలు చర్చలు జరపాలని, పరీక్ష పత్రాల లీకుకు బాధ్యత వహించి ప్రభుత్వం దిగిపోవాలని డిమాండ్ చేశారు. మెడికల్ ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ ను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వాలకే మెడికల్ సీట్ల భర్తీ హక్కులు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్ర పెత్తనం వల్లనే పేపర్లు లేకులు అయి విద్యార్థుల భవిషత్తుతో చలగాటం ఆడుతున్నారని అన్నారు. పేపర్ లీక్ కు బాధ్యతగా




కేంద్ర విద్యా శాఖ మంత్రి, విద్యార్థులపై దాడికి బాధ్యతగా నరేంద్ర మోడీ, అమిత్ షా లు రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమాన్ని విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది దాక్టర్ జిలుకర శ్రీనివాస్ సమన్వయం చేయగా, న్యాయవాదులు వలీ ఉల్లా ఖాద్రీ, కూనూరు రంజిత్ గౌడ్, ఇజ్జగిరి సురేష్, పెండ్యాల అనిల్ కుమార్, సన్నీ, గోదా బిక్షపతి, ఎగ్గడి సుందర్ రామ్, సాయి పవన్, బిఎస్ పాణి, రాజబాపు, యోగీ రావణ్, బరుపటి వినయ్ కుమార్, డాక్టర్ కొంగ వీరాస్వామి, కుమార్, యుగేందర్, అక్షయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య ఆకస్మిక తనిఖీలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా భద్రాద్రి జిల్లా బూర్గంపహాడ్ మండలంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య ఆధ్వర్యంలో ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. బుధవారం మండలంలోని ప్రధాన రహదారులపై చేపట్టిన తనిఖీల్లో అధికారులు వాహనాల డాక్యుమెంట్స్, ఫిట్నెస్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంవిఐ వెంకట పుల్లయ్య వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఎల్ఈడి లైట్లపై హెచ్చరిక వాహనాలకు అధిక పవర్ గల ఎల్ఈడి లైట్లు పెడితే ఎదుటి వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఎం వి ఐ వెంకట పుల్లయ్య ఆందోళన వ్యక్తం చేశారు. "నిబంధనలకు విరుద్ధంగా ఎల్ఈడి లైట్లు, ఫాగ్ లైట్లు, అధిక పవర్ బల్బులు పెట్టిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటాం.అలాంటి వాహనాలపై కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తాం" అని స్పష్టం చేశారు.డ్రైవర్లు అందరూ ఆర్ సి, డి ఎల్, ఇన్సూరెన్స్, పియుసి ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఉంచుకోవాలని, సీటు బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదని ఎం వి ఐ వెంకట పుల్లయ్య సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన పలు వాహనాలకు జరిమానాలు విధించినట్టు తెలిపారు.

# మట్టి పరీక్షలు–నేరుగా వరి విత్తే విధానంపై రైతులకు శాస్త్రీయ శిక్షణ

**బూర్గంపాడు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించి సాగు వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు బూర్గంపాడు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో రైతులకు మట్టి పరీక్షలు నేరుగా వరి విత్తే విధానంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని సంస్థ ప్రతినిధి అరుంధతి ఆధ్వర్యంలో నిర్వహించగా, డాక్టర్ ఎస్. కవిరాజు, వరి పరిశోధనా సంస్థ పరిశోధన సహచరుడు, రైతులకు శాస్త్రీయ వ్యవసాయ విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంట సాగుకు ముందు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకోవడం ద్వారా నేలలో ఉన్న పోషకాలు ఎంత మేరకు ఉన్నాయో తెలుసుకోవచ్చని తెలిపారు. ఆ వివరాల ఆధారంగా పంటకు అవసరమైన ఎరువులను సరైన మోతాదులో వినియోగిస్తే ఖర్చు తగ్గడంతో పాటు నేల సారవంతత కూడా కాపాడబడుతుందని వివరించారు. అవసరానికి మించి ఎరువులు వేయడం వల్ల నేల నాణ్యత దెబ్బతినే అవకాశముందని రైతులకు సూచించారు. అనంతరం నేరుగా వరి విత్తే విధానం గురించి వివరిస్తూ, ఈ పద్ధతిలో నీటి వినియోగం తగ్గుతుందని, కూలీలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని, సాగు ఖర్చు తగ్గి రైతులకు ఎక్కువ లాభం చేకూరుతుందని చెప్పారు. ఈ విధానంలో విత్తనాల ఎంపిక, కలుపు నివారణ, ఎరువుల వినియోగం, పంట నిర్వహణ వంటి అంశాలపై రైతులకు వివరంగా అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు తమ సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం ద్వారా మెరుగైన దిగుబడులు, అధిక ఆదాయం సాధించడమే ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు బిక్కసాని శ్రీనివాస్‌రావు, సంస్థ ప్రధాన కార్యనిర్వాహక అధికారి బత్తిన వెంకట ప్రసాద్, సంస్థ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. రైతులు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను తరచుగా నిర్వహించాలని కోరారు.



# ఖేడ్ పట్టణంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జులై 22, నారాయణ ఖేడ్ :**
ఈ సందర్భంగా స్థానిక కమ్యూనిస్టు పార్టీలకు చెందిన సుమారు 60 మంది కార్యకర్తలు ఎస్. చిరంజీవి ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎ ఐ యఫ్ బి) పార్టీలో చేరారు. వారికి పార్టీ రాష్ట్ర నాయకులు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అదే కార్యక్రమంలో ఎస్. చిరంజీవిని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్‌గా నియమిస్తూ పార్టీ నాయకత్వం బాధ్యతలు అప్పగించింది. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోజి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి. రాములు యాదవ్ పాల్గొని పార్టీ బలోపేతంతో పాటు పలు ప్రజా సమస్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ



సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోజి రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని,ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి బి.రాములు యాదవ్ మాట్లాడుతూ,నీట్ పేపర్ లీక్ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆశించిన స్థాయిలో పాలన అందించడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎస్. చిరంజీవి లక్ష్మణ్ మోచప్ప గణేష్ సోయల్ శోభ పండరి పాటు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నగరపాలకలో ప్రతి బుధవారం ప్రజావాణి : మేయర్ మూడ్ గణేష్

**ప్రజావాణికి వచ్చిన మొత్తం దరఖాస్తులు 26**
**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
బుధవారం నాడు కొత్తగూడెం నగరపాలక సంస్థ కార్యాలయం లో మేయర్ మూడ్ గణేష్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో మాట్లాడుతూ నగర పాలికలో మంచినీరు, విధి దీపాలు, శానిటేషన్ వంటివి ప్రధాన సమస్యలుగా ఉంటాయని, ప్రతి ఒక్క అధికారి విధులలో అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న పిర్యాదులు ఉన్న క్రింది స్థాయి అధికారి దగ్గర నుండి కాకుండా నేరుగా కమిషనర్, మేయర్ స్థాయికి రావడం సమంజసం కాదని, ఇటువంటి పరిస్థితులు ముమ్ముందు పునరావృత్తం కాకుండా మొట్ట మొదటి సారిగా కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశాల మేరకు నగరపాలక ప్రజలందరికి అధికారులు అందుబాటులో ఉండి ప్రతి పిర్యాదు త్వరతగతిన పరిస్కారం అయ్యే విధంగా ప్రతి బుధవారం ప్రజావాణి కార్యక్రమాన్ని సదుద్దేశంతో నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందని, నగర ప్రజలందరూ ఇట్టి అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ గణేష్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ పరిధిలో పనిచేసే అధికార యంత్రాంగం ఆయా శాఖలకు సంబందించిన ప్రజా పిర్యాదుల విషయంలో అలసత్వం వహించరాదని క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది పై ఆయా శాఖల అధికారుల పర్యవేక్షణ లోపం లేకుండా పనులు చేయించాలని, అధికార యంత్రాంగం నగరపాలక సంస్థ పనితీరుపై ప్రజలందరికి నమ్మకం పెరిగేలా ప్రతిఒక్కరు చిత్తశుద్ధితో విధుల్లో నిమగ్నం కావాలని సూచనలు చేశారు. ఇక నుండి జఠిలమైన సమస్యలు తప్ప వేరే ఏ చిన్న సమస్యలు క్షేత్ర స్థాయి పరిధి దాటి పై వరకు రాకుండా సంభదిత అధికారులు చూసుకోనియెడల చర్యలు తీసుకోవడంలో వెనకాడబోమని అధికారులు అందరు పూర్తి సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ సందర్బంగా కార్పొరేషన్ కమిషనర్ మాట్లాడుతూ అధికారులందరు మేయర్ చేసిన సూచనల మేరకు




పనిచేసే విధంగా ఒక పటిష్ట ప్రణాళిక రూపొందించి పిర్యాదులన్నీ త్వరతగతిన పరిస్కారం అయ్యేవిధంగా చర్యలు చెపడతామని అన్నారు. మొత్తము ప్రజావాణి పిటిషన్ 26 వచ్చినవి. ఇందులో పారిశుధ్యము 6, టౌన్ ప్లానింగ్ 5, ఇంటి పన్నులు 4, ఇంజినీరింగ్ విభాగము 5, చేయూత పెన్షన్ 4, ఇందిరమ్మ ఇండ్లు సంబంధించినవి 2 వచ్చినవి అని మేయర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ విజయానంద్, మేనేజర్ సత్యనారాయణ, ప్రసాద్, ఆర్ ఓ రవీందర్, టీ పి ఓ నవీన్, డీ ఈ శ్రీనివాసరావు, శానిటరి ఇన్స్పెక్టర్ అశోక్ చౌహాన్, డీఎంసి రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

# కృష్ణసాగర్‌లో విజయవంతమైన ఉచిత వైద్యశిబిరం

**సుమారు 200 మందికి ఆరోగ్య పరీక్షలు - ఉచిత మందుల పంపిణీ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం కృష్ణసాగర్ గ్రామపంచాయతీలో బుధవారం ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి తాటి వాణి ఉపసర్పంచ్ శ్రీ భూక్యా మోహన్ అధ్యక్షతన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామ ప్రజలు విశేషంగా స్పందించారు. ఈ వైద్య శిబిరం లో సుమారు 200 మంది ప్రజలు పాల్గొని రక్తపరీక్షలు చేయించుకున్నారు. అలాగే రక్తపోటు, మధుమేహం, మూత్రపిండాలు, కాలేయం, కంటి సంబంధిత వ్యాధులు తదితర ఆరోగ్య సమస్యలకు పరీక్షలు చేయించుకుని వైద్యుల నుంచి విలువైన సలహాలు పొందారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా నాణ్యమైన మందులను పంపిణీ చేసి, వాటి వినియోగంపై వైద్యులు అవగాహన కల్పించారు.ఈ శిబిరానికి ఖమ్మం నుండి ప్రముఖ వైద్యులు డాక్టర్ సునీల్ కుమార్ జంగాల (ఎం.డి., డి.ఎం., సాయిరామ్ హాస్పిటల్), డాక్టర్ స్వాతి జంగాల (ఎం.బి.బి.ఎస్., డి. దయాబ్.), డాక్టర్ శ్రావణి (ఎం.బి.బి.ఎస్.), డాక్టర్ రేణుక (ఎం.బి.బి.ఎస్.) హాజరై ప్రజలకు వైద్య సేవలు అందించారు. అలాగే సేవ్ యువర్





లివర్ ఫౌండేషన్ డైరెక్టర్ జంగాల రాజేశ్వరరావు, సామ్యూల్ గెడ్డం వైద్య సిబ్బంది శిబిరం నిర్వహణలో పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు, వచ్చిన వైద్యులు, సిబ్బందికి అల్పాహారం, భోజన సదుపాయాలను సర్పంచ్ తాటి వాణి ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడంలో నవభూమి విలేకరి సెనగ మల్లేష్, మెండి భాస్కర్ సమన్వయకర్తలుగా వ్యవహరించి వైద్య బృందాన్ని గ్రామానికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ తాటి వాణి మాట్లాడుతూ, "గ్రామ ప్రజల ఆరోగ్యమే మా గ్రామాభివృద్ధికి పునాది. గ్రామస్థాయిలోనే నిపుణులైన వైద్యులతో ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించుకునే అవకాశం కల్పించాలనే లక్ష్యంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించాము. భవిష్యత్తులో కూడా ప్రజలకు అవసరమైన ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం చేపడతాం. శిబిరాన్ని విజయవంతం చేసిన వైద్య బృందానికి, సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ప్రతినిధులకు, సమన్వయకర్తలు సెనగ మల్లేష్, మెండి భాస్కర్‌తో పాటు సహకరించిన గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని అన్నారు.గ్రామస్థాయిలోనే నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయించుకునే అవకాశం లభించడంతో పాటు ఉచితంగా మందులు అందడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ నిర్వాహకులు, వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని వారు అభిప్రాయపడ్డారు.

# మేడిపల్లి శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా విద్యార్థుల అధికార స్వీకార వేడుకలు

**బాధ్యత భావం, నైతిక విలువలు, సేవా దృక్పథాన్ని పెంపొందించే అవశ్యకతే లక్ష్యంగా**


**మేడిపల్లి, జూలై 22, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిర్జాదిగూడా మున్సిపాలిటీ పరిదిలోని మేడిపల్లి శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థుల అధికార స్వీకార వేడుకలు (ఇన్వెస్టిచర్ సెర్మనీ) అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు వివిధ నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. తద్వారా వారిలో బాధ్యతా భావం, నైతిక విలువలు మరియు సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు చక్కటి వేదిక కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టి. ప్రసన్నలక్ష్మీ, మాజీ కార్పొరేటర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులంతా భవిష్యత్తులో ఉత్తమ నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.నాయకత్వం అనేది కేవలం ఒక పదవి కాదని, అది ఒక గొప్ప బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ నైతికతతో, నిజాయితితో నడుచుకుంటే సమాజంలో గొప్ప నాయకులుగా రాణించగలరని ఉద్బోధించారు. ఈ వేడుకల్లో భాగంగా నూతన నాయకత్వ బాధ్యతలు చేపట్టిన విద్యార్థులకు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణగూడ ఏజీఎం నూర్ మొహమ్మద్ అలీ, ఆర్.ఐ. బండి వెంకటేష్, అకాడమిక్ కో ఆర్డినేటర్ డి. రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ మాలతి రెడ్డి, డీన్ మధుకర్ తదితర ముఖ్య ప్రముఖులు పాల్గొన్నారు. వీరితో పాటు పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# మున్సిపల్ ఉద్యోగుల కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ఇతర మున్సిపాలిటీలో మాదిరిగా నారాయణఖేడ్ మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, నారాయణ ఖేడ్ :**
నారాయణఖేడ్ మున్సిపల్ కార్మికుల వేతనాలు, సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి కి సిపిఐ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి ఎన్ రమేష్ మాట్లాడుతూ నారాయణఖేడ్ పట్టణ మున్సిపాలిటీలో పనిచేస్తున్న డ్రైవర్లకు, కంప్యూటర్ ఆపరేటర్స్, సూపర్వైజర్స్ కు వేతనాలు ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే తక్కువ వస్తున్నాయి. పీఎఫ్ డబ్బులు రెగ్యులర్గా జమ చేయడం లేదు, పట్టణ విస్తీర్ణకు అనుగుణంగా వర్కర్లను, చెత్త బండ్లను పెంచాల్సిన అవసరం ఉంది, కార్మికులందరికీ ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు, చెప్పులు, యూనిఫామ్, సీజనల్ ప్రొటెక్షన్, తదితర సౌకర్యాలను కూడా ఇవ్వలేదు కావున తమరు చొరవ తీసుకుని తక్షణమే పై సమస్యలను పరిష్కారం చేయాలని లేని పక్షంలో 14 రోజుల తర్వాత చట్టం ప్రకారం సమ్మె చేస్తామని, 14 రోజుల అనంతరం ఎప్పుడైనా సమ్మెలోకి కార్మికులు వెళతారని తమరికి ఈ సమ్మె నోటీస్ ద్వారా తెలియజేస్తున్నాము అన్నారు. మున్సిపల్ కార్మికులు రవి ఏసు సాయిలు రాజు సాయిలు శకుంతల సాయమ్మ చంద్రకళ సుశీల తదితరులున్నారు.


తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయీస్ యూనియన్
రి.నెం:హెచ్-18 (సిఐటియు అనుబంధం) సంగారెడ్డి జిల్లా కమిటి

తేది : 22/07/2026.

శ్రీయుత గౌరవనీయులైన మున్సిపల్ కమిషనర్ గారికి,
నారాయణఖేడ్ మున్సిపల్.

విషయం :- మున్సిపల్ కార్మికుల వేతనాలు, సమస్యల పరిష్కారానికి సమ్మె నోటీసు ఇవ్వడం పెంచాలని కోరుట గురించి...

ఆర్యా !
తమరుతో మనవి చేయునది, నారాయణఖేడ్ పట్టణ మున్సిపాలిటీలో పనిచేస్తున్న డ్రైవర్లకు, కంప్యూటర్ ఆపరేటర్స్, సూపర్వైజర్స్ కు వేతనాలు ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే తక్కువ వస్తున్నాయి. పీఎఫ్ డబ్బులు రెగ్యులర్గా జమ చేయడం లేదు, పట్టణ విస్తీర్ణకు అనుగుణంగా వర్కర్లను, చెత్త బండ్లను పెంచాల్సిన అవసరం ఉంది, కార్మికులందరికీ ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు, చెప్పులు, యూనిఫామ్, సీజనల్ ప్రొటెక్షన్, తదితర సౌకర్యాలను కూడా ఇవ్వలేదు కావున తమరు చొరవ తీసుకుని తక్షణమే పై సమస్యలను పరిష్కారం చేయాలని లేని పక్షంలో 14 రోజుల తర్వాత చట్టం ప్రకారం సమ్మె చేస్తామని, 14 రోజుల అనంతరం ఎప్పుడైనా సమ్మెలోకి కార్మికులు వెళతారని తమరికి ఈ సమ్మె నోటీస్ ద్వారా తెలియజేస్తున్నాము.

అభివందనాలతో ............

ఇట్లు:-
(యన్. రమేష్)
CITU యూనియన్ సెక్రటరి
సెల్ నం 8978278030

పురపాలక సంఘం: నారాయణఖేడ్
ఇన్‌వార్డు నెం......126......
తేది:......22/7/26......


# సాంకేతిక లోపంతో చేజారిన ఫీజు రీయింబర్స్మెంట్

**విద్యార్థినికి అండగా ఎమ్మెల్యే పాయం**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
పినపాకమండలంలోని గోపాలరావుపేట గ్రామానికి చెందిన గాడుదుల దీక్షిత ఇంటర్‌లో 992 మార్కులు సాధించి, టీజీ ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకుతో ఇంజినీరింగ్ సీటు పొందింది. అయితే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో జరిగిన సాంకేతిక లోపం కారణంగా ప్రభుత్వ కేటగిరీకి బదులుగా ప్రైవేట్ కేటగిరీలో నమోదు కావడంతో రూ.64 వేల ఫీజు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తోగూడెం ఉపసర్పంచ్ అచ్చా నవీన్ ద్వారా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ల దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన ఈఏపీసెట్ కన్వీనర్‌కు సిఫార్సు లేఖ అందజేశారు. ఎమ్మెల్యే చొరవతో అధికారులు రీ-వెరిఫికేషన్ నిర్వహించి లోపాన్ని సరిదిద్దడంతో దీక్షితను తిరిగి ప్రభుత్వ కేటగిరీలో చేర్చారు. దీంతో ఫీజు రీయింబర్స్మెంట్‌కు మార్గం సుగమమైంది. తమ కుమార్తె చదువుకు అండగా నిలిచిన ఎమ్మెల్యేకు దీక్షిత తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఇంటర్‌లో 992 మార్కులు సాధించిన దీక్షితను శాలువాతో సత్కరించి అభినందించారు.

# గురు పౌర్ణమి ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, జహీరాబాద్:**
సంగారెడ్డి జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఈ నెల 29న నిర్వహించనున్న గురు పౌర్ణమి వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరు కావాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్ ఆహ్వానించారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి ఉత్సవాలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

## వినాయకపురం ప్రాధమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మిక తనఖీ

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** వినాయకపురం ప్రాధమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మిక తనఖీ చేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్. అశ్వరావుపేట, దమ్మపేట మండలాల్లో ఉన్నటువంటి ప్రైవేట్ రక్త పరీక సెంటర్ లు నడుపుతున్న ఇంచార్జెస్ తో సమావేశం నిర్వహించి నారు.ఈ సమావేశంలో ముఖ్యంగా అన్ని రక్త పరీక్ష కేంద్రాలకు తప్పని సరిగా రిజిస్ట్రేషన్, ఫైర్, బయో మెడికల్ వేస్ట్ మానేజ్మెంట్, పొల్యూషన్ సర్టిఫికెట్స్ తప్పనిసరిగా ఉండాలని, అలాగే సర్టిఫైడ్ ఎంబీబీఎస్ డాక్టర్ సలహా ప్రకారం టెస్ట్ లు చేయాలని సూచించి నారు. లబ్ నడుపుతున్న వారు తప్పని సరిగా క్వాలిఫైడ్ ట్రైనింగ్ పొంది ఉండాలని, వారు వాడుతున్న రీజెంట్స్ అన్ని ఎక్స్పిరీ తేదీ లోపు ఉండాలని చెప్పినారు.లబ్ లలో చేసిన మలేరియా, డెంగీ పాజిటివ్ కేసు ల వివరాలు తప్పకుండ సంబంధిత వైద్య శాఖా అధికారులకు అందచేయాలనీ చెప్పినారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా గిరిజన సమిక్రుత సంస్థ ప్రాజెక్టు అధికారి భద్రబ్ వారు నిర్దేశించిన పరీక్షల రుసుమును మాత్రమే వసూలు చేయాలనీ సూచించి నారు.ఈ సమావేశంలో వైద్యధి కారి డాక్టర్ రాందాస్, డాక్టర్ నౌసిన్ లు మాట్లాడుతూ అన్ని లబ్ ఇంచార్జి లు వైద్య శాఖా నిబంధనలకు లోబడి పరీక్షలు చేయాలనీ, పూర్తి పరీక్షలు చేయకుండా సొంతంగా ట్రీట్మెంట్ చేయరాదని చెప్పినారు. ఈ సమావేశంలో ఈ రెండు మండలాల లబ్ ఇంచార్జి లతో పాటు వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

## శ్రీలంకపై దండెత్తిన డేంజర్ వైరస్..! 76 వేల కేసులు..!




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22 :**
తీవ్రమైన ఆర్థిక, రాజకీయ సంక్షోభాల నుంచి కోలుకుంటున్న పొరుగు దేశం శ్రీలంకను ఇప్పుడు భారీ ఆరోగ్య సంక్షోభం కుదిపేస్తోంది. గత దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని విధంగా అత్యంత భయంకరమైన 'డెంగ్యూ విజృంభణ'తో ఆ దేశం విలవిలలాడుతోంది. ఊహించని రీతిలో కేసులు పెరుగుతుండటంతో ఆసుపత్రులన్నీ బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు లంక ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. చివరికి దోమల నిర్మూలన కోసం సొంత సైన్యాన్ని, ఎయిర్ ఫోర్స్ డ్రోన్లను కూడా రంగంలోకి దించాల్సి వచ్చింది.

**76 వేల కేసులు.. శరవేగంగా మహమ్మారి వ్యాప్తి!**
శ్రీలంక ఆరోగ్య శాఖ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఏకంగా 76,044 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఈ డెంగ్యూ బారిన పడి ఇప్పటికే 53 మంది ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా గత కొద్ది రోజుల్లోనే అంటే ఒక్క జులై మొదటి రెండు వారాల్లోనే ఏకంగా 18,000 పైగా కొత్త కేసులు వెలుగుచూడటం అక్కడి తీవ్రతకు అద్దం పడుతోంది. 2017లో లక్షకు పైగా కేసులు వచ్చిన ఆల్-టైమ్ రికార్డు స్థాయికి ప్రస్తుత విలయం దగ్గరవుతుండటంతో లంక వాసులు భయాందోళనలకు గురవుతున్నారు.

**దోమల వేటకు ఎయిర్‌ఫోర్స్ డ్రోన్లు!**
సాధారణంగా సరిహద్దుల వద్ద శత్రువుల కదలికలను కనిపెట్టేందుకు వాడే డ్రోన్లను లంక ప్రభుత్వం ఇప్పుడు దోమల ఉత్పత్తి కేంద్రాలను పట్టుకోవడానికి వాడుతోంది. శ్రీలంక ఎయిర్ ఫోర్స్‌కు చెందిన అత్యాధునిక డ్రోన్లను ఆకాశంలోకి పంపి.. భవనాలపై నిలిచిపోయిన నీటి నిల్వలను, దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తిస్తున్నారు. అంతేకాకుండా, రద్దీగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల పరిస్థితిని పర్యవేక్షించేందుకు, వైద్య సిబ్బందికి సహాయపడేందుకు కూడా ఈ డ్రోన్లను ఉపయోగిస్తుండటం గమనార్హం.

**ఆసుపత్రులలో బెడ్ల కొరత..**
బాధితుల సంఖ్య రోజురోజుకూ రికార్డు స్థాయిలో పెరుగుతుండటంతో ఆసుపత్రులన్నీ నిండిపోయాయి. పరిస్థితి చేయిదాటిపోకుండా ఉండేందుకు వైద్యాధికారులు ఆసుపత్రుల సామర్థ్యాన్ని పెంచుతున్నారు. అదనపు బెడ్లు వేయడంతో పాటు, సాధారణ వార్డులను డెంగ్యూ కేర్ యూనిట్లుగా మారుస్తున్నారు. పెరిగిన రోగుల భారాన్ని తట్టుకోవడానికి అదనపు వైద్య సిబ్బందిని, నర్సులను నియమించి అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు.

## విద్యార్థులపై లాఠీ చార్జి చేసినందుకు మోడీ బేషరతుగా క్షమాపణ చెప్పాలి..

**బీజేపీ పాలనలో ప్రశ్నాపత్రాల లీకేజీలు నిత్యకృత్యంగా మారాయి..**

**యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ పాలనలో దేశవ్యాప్తంగా పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు వరుసగా జరుగుతూ, కోట్లాది మంది విద్యార్థుల ఆశయాలు, వారి భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆయన ఆరోపించారు.ఆలేరు పట్టణంలోని మహాత్మ గాంధీ, బాబా సాహెబ్ అంబెడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ తర్వాత నిరసన దీక్ష చేపట్టి, భారీ ర్యాలీ చేపట్టారు..ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ లెక్కల ప్రకారం గత కొన్నేళ్లలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, ఈ ఘటనల వల్ల లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర అనిశ్చితి, ఆందోళనలకు గురయ్యారని తెలిపారు.విద్యార్థులు నెలల తరబడి కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమవుతుంటే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రశ్నాపత్రాలు లీక్ కావడం అత్యంత దురదృష్టకరమని అన్నారు.ఇటీవల జరిగిన నీట్ ప్రశ్నాపత్రం లీక్ కారణంగా పరీక్ష నిర్వహణపై తీవ్ర వివాదం నెలకొని, పరీక్ష రద్దు కావడం వల్ల దేశవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని పేర్కొన్నారు. ఈ అనిశ్చితి, ఆందోళనల నేపథ్యంలో 21 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోందని తెలిపారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే పరిస్థితి దేశానికి మంచిది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీర్ల ఐలయ్య విమర్శించారు.పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యత, భద్రత కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించలేకపోయిందని అన్నారు. ఈ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు.విద్యార్థుల భవిష్యత్తు, వారి కష్టం, తల్లిదండ్రుల ఆశలను కాపాడేందుకు ప్రశ్నాపత్రాల లీకేజీలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై నిర్దాక్షిణ్యంగా చర్యలు చేపట్టి పరీక్షల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పునరుద్ధరించాలని బీర్ల ఐలయ్య కోరారు.

## కామధేను ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా**

**కామధేను ఫౌండేషన్ అధ్యక్షులు: పి. వెంకటేష్ ఆధ్వర్యంలో**

**రామచంద్రపురం, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22 :**
హైదరాబాద్‌లోని ఎంఎన్ జే క్యాన్సర్ ఆసుపత్రిలో కామధేను ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని తెలంగాణ రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా కొనియాడారు. బుధవారం ఎంఎన్ జే క్యాన్సర్ ఆసుపత్రి పిల్లల వార్డు కోసం కామధేను ఫౌండేషన్ అధ్యక్షులు పి. వెంకటేష్ ఆధ్వర్యంలో సింసన్ ఫార్మా సౌజన్యం తో సుమారు రూ. 1.50 లక్షల విలువైన టేబుళ్లు, కుర్చీలు, పేషెంట్ల రక్త నమూనాల సేకరణ ఫర్నిచర్ మెటీరియల్‌ను ఆసుపత్రికి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యాస్మిన్ బాషా మాట్లాడుతూ.. సమాజంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెన్నో జరగాలని, ముఖ్యంగా






క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిల్లల కోసం కామధేను ఫౌండేషన్ ముందుకు వచ్చి సహాయం చేయడం అభినందనీయమన్నారు. క్యాన్సర్ మహమ్మారి బారిన పడకుండా ప్రజలు మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రిలో ప్రాణాలకు రక్షణగా నిలుస్తూ అంకిత భావంతో సేవనందిస్తున్న డాక్టర్లు, నర్సులు మరియు సిబ్బంది సేవలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, ఎంఎన్ జే క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సదాశివుడు, డాక్టర్ శిల్ప, కామధేను ఫౌండేషన్ అధ్యక్షులు పి. వెంకటేష్, ఫౌండేషన్ ప్రతినిధులు ఉమేష్ జి.ఎస్., అరవింద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా విద్యార్థుల అధికార స్వీకార వేడుకలు

**బాధ్యత భావం, నైతిక విలువలు, సేవా దృక్పథాన్ని పెంపొందించే అవశ్యకతే లక్ష్యంగా**

**మేడిపల్లి, జూలై 22, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిర్జాదిగూడా మున్సిపాలిటీ పరిధిలోని మేడిపల్లి శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థుల అధికార స్వీకార వేడుకలు (ఇన్వెస్టిచర్ సెర్మనీ) అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు వివిధ నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. తద్వారా వారిలో బాధ్యతా భావం, నైతిక విలువలు మరియు సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు చక్కటి వేదిక కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టి. ప్రసన్నలక్ష్మీ, మాజీ కార్పొరేటర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులంతా భవిష్యత్తులో ఉత్తమ





నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.నాయకత్వం అనేది కేవలం ఒక పదవి కాదని, అది ఒక గొప్ప బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ నైతికతతో, నిజాయితితో నడుచుకుంటే సమాజంలో గొప్ప నాయకులుగా రాణించగలరని ఉద్బోధించారు. ఈ వేడుకల్లో భాగంగా నూతన నాయకత్వ బాధ్యతలు చేపట్టిన విద్యార్థులకు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణగూడ ఏజీఎం నూర్ మొహమ్మద్ అలీ, ఆర్.ఐ. బండి వెంకటేష్, అకాడమిక్ కో ఆర్డినేటర్ డి. రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ మాలతి రెడ్డి, డీన్ మధుకర్ తదితర ముఖ్య ప్రముఖులు పాల్గొన్నారు. వీరితో పాటు పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాంగ్రెస్ ధర్నాలు రాజకీయ డ్రామాలే...

## రేవంత్ సర్కార్, రాహుల్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర ధ్వజం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, తెలంగాణ డెస్క్: ఢిల్లీలో** రాహుల్ గాంధీ, తెలంగాణలో రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ధర్నాలను రాజకీయ డ్రామాలు అంటే కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో కాంగ్రెస్‌ను అసలు ప్రతిపక్షంగానే ప్రజలు గుర్తించడం లేదని, కేవలం రాజకీయ నాటకాలతో ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ ఆందోళనలు చేస్తున్నారని విమర్శించారు. సీజేపీ (కాక్రోచ్ పార్టీ)తో పోటీ పడేందుకే కాంగ్రెస్ ఇటువంటి ధర్నాలకు దిగుతున్నట్లు కనిపిస్తోందన్నారు. రాహుల్ గాంధీ బీజేపీకి బ్రాండ్ అంబాసిడర్ అని, ఆయన ప్రతిపక్ష నేతగా ఉన్నంత కాలం బీజేపీకే లాభమని వ్యాఖ్యానించారు.రాహుల్ గాంధీపై తాము దౌర్జన్యం చేయాల్సిన అవసరం లేదని, ప్రధాని నివాసం ముందు ధర్నా పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారని స్పష్టం చేశారు. నీట్ వ్యవహారంలో దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని, చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ డ్రామాలు ఆపి చర్చకు రావాలని సవాల్ విసిరారు.మరోవైపు తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు చేస్తున్న ధర్నాలు పెద్ద జోక్ అని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ కాబోయే ప్రధాని అని రేవంత్ అనడం విడ్డూరంగా ఉందన్న ఆయన, రాహుల్ ప్రధాని కావడం దేవుడెరుగు.. రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడం కూడా కల అని పేర్కొన్నారు. రాష్ట్రంలో పొలాల్లో నారు ఎండిపోయి, ఎరువులు అందక రైతులు అల్లాడుతుంటే సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఆరు గ్యారంటీల అమలులో ఫెయిల్ కావడంతో ప్రజల్లో వెల్లువెత్తుతున్న ఆగ్రహం నుంచి దృష్టి మళ్లించేందుకే రేవంత్ సర్కార్ ఈ నిరసన డ్రామాలకు తెరదీసిందని ఆరోపించారు. ఇకనైనా ఆందోళనలు ఆపి, రైతుల పంటలకు సాగునీరందించి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.



# ఐక్యరాజ్యసమితి వేదికగా పాకిస్థాన్ కు భారత్ స్ట్రాంగ్ వార్నింగ్!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22 :** ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వేదికగా భారత్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఆఫ్ఘనిస్తాన్ పక్షాన భారత్ గట్టిగా వాదించింది. ఆ దేశంలో ఐక్యరాజ్యసమితి ఆంక్షలను సమీక్షించాలని భారత్ డిమాండ్ చేసింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశంలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ మాట్లాడుతూ.. ఆఫ్ఘనిస్తాన్‌లో రాజకీయ పరిస్థితి గణనీయంగా మారిందని పేర్కొన్నారు. అందువల్ల ఆఫ్ఘనిస్థాన్‌పై ఎప్పటి నుంచో అమల్లో ఉన్న ఐక్యరాజ్యసమితి ఆంక్షల విధానాన్ని తక్షణమే పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆఫ్ఘనిస్తాన్‌పై పాకిస్థాన్ నిరంతరం వైమానిక దాడులు జరుపుతున్న సమయంలో భారత్ ఈ ప్రకటన చేసింది.

**ఆఫ్ఘనిస్తాన్‌పై ఆంక్షలను ఎత్తివేయాలి.. భారత్ డిమాండ్**

ఆఫ్ఘనిస్తాన్‌పై ప్రస్తుతం అమలవుతున్న శిక్షాత్మక చర్యలు, ఆంక్షలు తమ ప్రభావాన్ని పూర్తి కోల్పోయామని పర్వతనేని హరీష్ పేర్కొన్నారు. ఆఫ్ఘనిస్తాన్‌తో చర్చల కోసం అంతర్జాతీయ సమాజం ఓ కొత్త విధానాన్ని అవలంభించాలని ఆయ కోరారు. ఆఫ్ఘనిస్తాన్‌పై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడులను కూడా హరీష్ ఖండించారు. ఈ దాడుల వల్ల గణనీయమైన ప్రాణనష్టం జరిగిందని ఆఫ్ఘనిస్తాన్‌లోని ఐక్యరాజ్యసమితి సహాయక మిషన్ నివేదికలను పేర్కొంటూ.. పాకిస్థాన్ చర్యలు ప్రాంతీయ శాంతికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయని భారత్ పేర్కొంది.

**పాకిస్థాన్ దాడులను ఖండించిన భారత్:**

ఆఫ్ఘనిస్తాన్‌తో వాణిజ్యం, రవాణాపై పాకిస్తాన్ ఆంక్షలు విధిస్తోందని భారత ప్రతినిధి బృందం ఆరోపించింది. వాటిని తొలగించాలని డిమాండ్ చేసింది. ఆఫ్ఘనిస్తాన్ ఓ భూపరివేష్టిత దేశం.. అంతర్జాతీయ వాణిజ్యం



కోసం చాలా కాలంగా పాకిస్తాన్‌పై ఆధారపడి ఉంది. అయితే ఆఫ్ఘనిస్తాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు పాకిస్తాన్ దీనిని అవకాశంగా వాడుకుంటోంది. పాకిస్తాన్ ఆఫ్ఘన్ సరిహద్దును పూర్తిగా మూసివేసింది. దీనివల్ల వస్తువుల రవాణాకే కాకుండా ప్రజల రాకపోకలకు కూడా అంతరాయం కలుగుతోంది. తక్షణమే ఈ అక్రమ రవాణా ఆంక్షలను ఎత్తివేయాలని భారత్ గట్టిగా డిమాండ్ చేసింది.

# భవిష్యత్ తరాలకు నీటి వనరులను సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత

**క్యాచ్ ద రేన్ - సేవ్ ఎవరీ డ్రాప్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంలో 'క్యాచ్ ద రేన్ – సేవ్ ఎవరీ డ్రాప్' కార్యక్రమానికి సంబంధించిన అవగాహన బ్రోచర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, వర్షపు నీటిని ప్రతి ఒక్కరూ సేకరించి భవిష్యత్ తరాలకు నీటి వనరులను సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో వర్షపు నీటి సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో, వ్యాపార సముదాయాల్లో తప్పనిసరిగా రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని




సూచించారు.

వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేస్తే భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్యను చాలా వరకు అధిగమించవచ్చని తెలిపారు.

ప్రజల్లో నీటి సంరక్షణపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, "ఈరోజు ప్రతి నీటి చుక్కను కాపాడితే రేపటి భవిష్యత్తు సురక్షితం అవుతుంది"




అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీ భరత్ గౌడ్, వైస్ చైర్మన్ బరిగె రమ్య రాంచందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సీజేపీ ఆందోళనలో సీక్రెట్ యాప్స్!.. ఢిల్లీ పోలీసుల విచారణలో కీలక విషయాలు?

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, సెంట్రల్ బ్యూరో:** చలో పార్లమెంట్ సందర్భంగా సోమవారం కాక్రోచ్ జనతా పార్టీ విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీచార్జి దేశరాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. విద్యార్థులపై పోలీసులు అమానుష దాడికి పాల్పడ్డారంటూ ఈ దాడికి నిరసనగా ప్రధాన పార్టీలు ఆందోళన బాట పట్టాయి. ఓ వైపు పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతున్న వేళ సీజేపీ ఆందోళనలు దేశరాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ క్రమంలో మొన్నటి సీజేపీ ఆందోళనలు హింస, ఉద్రిక్తతకు దారితీయడంతో ఢిల్లీ పోలీసులు వివిధ పోలీస్ స్టేషన్లలో మొత్తం 10 ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

**సీక్రెట్ యాప్ లతో చాటింగ్:**

20 రోజులకు పైగా జంతర్ మంతర్ వద్ద దీక్ష చేస్తున్న సీజేపీ విద్యార్థులు 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా కమ్యూనికేషన్ కోసం సీక్రెట్ యాప్?లను ఉపయోగించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సోమవారం ర్యాలీ ఉద్రిక్తతలకు దారి తీయగా పోలీసులు వెనంటనే ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. అయినా విద్యార్థులు పెద్ద ఎత్తున పోగుకావడం వెనుక కమ్యూనికేషన్ కొనసాగించేందుకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చాటింగ్ చేసుకున్నారని అయితే ఈ చాటింగ్?లలో నిరసన సందర్భంగా అవసరం అయితే ప్రాణాలర్పించేందుకు కూడా సిద్ధమేనంటూ ఉన్న సందేశాలతో కూడిన చాట్?లను పోలీసులు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. బ్లూటూత్ సిగ్నల్స్ ఆధారంగా పనిచేసే కొన్ని ప్రత్యేక యాప్‌ల ద్వారా గ్రూప్ సభ్యులు నిరంతరం టచ్‌లో ఉండాలని చాట్‌లలో సూచించినట్లు బయటపడింది. ఈ ఘటనలో 118 మంది పోలీసు సిబ్బంది, 70 మంది నిరసనకారులు గాయపడగా, 15 నుండి 20 ప్రభుత్వ వాహనాలు ధ్వంసమయ్యాయి. ఘటనా స్థలంలో ఇంటర్నెట్ జామర్లు ఏర్పాటు చేసినా బ్లూటూత్ సిగ్నల్స్ ఆధారంగా పనిచేసే కొన్ని ప్రత్యేక యాప్‌ల ద్వారా గ్రూప్ సభ్యులు నిరంతరం టచ్‌లో ఉండాలని చాట్‌లలో సూచించినట్లు బయటపడింది. ఆ యాప్‌ల లింక్‌లను కూడా సదరు గ్రూపుల్లో షేర్ చేసినట్లు సమాచారం.

**మోడీ ప్రభుత్వానికి ఇదే చివరి రోజు:**

వెలుగులోకి వచ్చిన చాటింగ్?లలో తీవ్రస్థాయి రాజకీయ వ్యాఖ్యలు, ఉద్రిక్తత పెంచే పిలుపులు ఉన్నట్లు విచారణాధికారులు గుర్తించినట్లు సమాచారం. ఓ చాట్?లో 'నిరసనలో ఎవరైనా ప్రాణాలు కోల్పోతే, అది



ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుంది" అని ఉండగా, మరొక చాట్‌లో ప్రాణాలర్పించిన వారి త్యాగాన్ని రాబోయే తరాలు గుర్తుంచుకుంటాయనే అర్థంలో సంభాషణలు సాగాయని అంతేకాకుండా 'మోడీ ప్రభుత్వానికి ఇదే చివరి రోజు'అంటూ కూడా వ్యాఖ్యలు ఉన్నట్లు తెలుస్తోంది. సేకరించిన డిజిటల్ ఆధారాలు, చాట్‌ల యజమానులు, వాటి మూలాలను నిర్ధారించేందుకు సైబర్ నిపుణుల సాయంతో ఫోరెన్సిక్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్, డ్రోన్ విజువల్స్, మొబైల్ వీడియోలతో పాటు ఈ డిజిటల్ ఆధారాలను పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఈ సంభాషణలు కేవలం వ్యక్తుల వ్యక్తిగత అభిప్రాయాలా లేదా హింసను ప్రేరేపించడానికి చేసిన కుట్రలో భాగమా అనేది పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.

# మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడమే లక్ష్యం

**జన్ శిక్షన్ సంస్థాన్ ఆధ్వర్యంలో ఘనంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం.**

**ముఖ్య అతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, శేరిలింగంపల్లి :**

హఫీజ్పేట్ డివిజన్ బాలింగ్ సత్తయ్య గౌడ్ గారి మెమోరియల్ ఫౌండేషన్ లో స్థానిక జన్ శిక్షన్ సంస్థాన్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణా సదస్సుకు నిరుద్యోగ యువతీ యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

స్వయం ఉపాధితోనే మహిళా సాధికారత – గౌతమ్ గౌడ్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి కాలంలో కేవలం చదువు మాత్రమే సరిపోదని, ప్రతి ఒక్కరూ ఏదో ఒక నైపుణ్యాన్ని నేర్చుకుని స్వయం ఉపాధి సాధించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు, తద్వారా సమాజం బాగుపడుతుందని అభిప్రాయపడ్డారు. జన్ శిక్షన్ సంస్థాన్ ద్వారా అందిస్తున్న ఇటువంటి ఉచిత శిక్షణ శిబిరాలను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలు, డ్రాపౌట్స్ సద్వినియోగం



చేసుకోవాలని కోరారు. సమాజ సేవలో ముందుంటున్న జేఎస్ఎస్ నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు తమకు ఈ అవకాశం కల్పించినందుకు సంస్థకు, శిక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# జగిత్యాల్లో భారీ వర్షానికి నెలకొరిగిన వృక్షం

**22వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ అధికారుల సమన్వయంతో తొలగింపు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, జగిత్యాల :** బుధవారం కురిసిన భారీ వర్షాల కారణంగా జగిత్యాల పట్టణంలోని ఎస్‌కేఎన్ఆర్ బాయ్స్ కాలేజ్ మూల మలుపు వద్ద ఒక భారీ వృక్షం విరిగి రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనంపై పడింది. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగలేదు. సమాచారం అందుకున్న వెంటనే 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి (బిట్టు) సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మున్సిపల్ అధికారులకు సమాచారం అందించి, మున్సిపల్ సిబ్బందితో కలిసి రోడ్డుపై పడిన వృక్షాన్ని వెంటనే తొలగించి, రాకపోకలు యథావిధిగా కొనసాగేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అరవ లక్ష్మి (బిట్టు) మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ చందు, జావన్ లక్ష్మి నారాయణ, మరియు ఎన్విరాన్మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టు, నీట్ (నీట్) అక్రమాలపై బీరంగూడలో కాంగ్రెస్ ధర్నా

**ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి: కాట శ్రీనివాస్ గౌడ్**






**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22 :** పటాన్‌చెరు: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకుల అరెస్టులను ఖండిస్తూ, నీట్ (నీట్) పరీక్షలో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీరంగూడ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసుల లాఠీచార్జ్‌ను ఆయన తీవ్రంగా ఖండించారు. అలాగే, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుల గొంతును అణచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# యాదగిరిగుట్టలో కుక్కల దాడిలో గొర్రెలు మృతి..

**బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని యాదవ్ నగర్ ప్రాంతంలో కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన ఘటనపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, జరిగిన నష్టంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున అందుబాటులో ఉన్న సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి గుండ్లపల్లి వాణి భారత్ గౌడ్ బాధిత కుటుంబానికి తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రజలకు అండగా నిలవడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.


# మహిళా ఎంపీపై అనుచిత వ్యాఖ్యలు: టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీపై లోక్‌సభ సస్పెన్షన్ వేటు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, వెబ్ డెస్క్:**
నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్ లో దుమారం రేపుతున్న క్రమంలో మహిళా ఎంపీపై టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ చేసిన అనుచిత వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. టీఎంసీ ఎంపీ వ్యాఖ్యలతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. సభలో టీఎంసీ రెబల్ ఎంపీలతో గొడవకు దిగారు. అలాగే ఒక మహిళా ఎంపీ పట్ల తీవ్రమైన పార్లమెంటరీయేతర పదజాలాన్ని ఉపయోగించారు. దీంతో తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ ఎంపీ కల్యాణ్ బెనర్జీపై లోక్‌సభ సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు సభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి లోక్‌సభ ఆమోదం తెలిపింది. వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఆయనను సస్పెండ్ చేస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. సభా వ్యవహారాల నియమావళి ప్రకారం ప్రజాప్రతినిధులు గౌరవప్రదంగా ప్రవర్తించాలని, మహిళా సభ్యురాలిపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సభా దిగ్బంధనానికి, క్రమశిక్షణా రాహిత్యానికి సంకేతమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారు... కేంద్రంపై పసుపులేటి కళావతి విమర్శలు

**హైదరాబాద్ పల్స్, జూలై 22, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**




దేశవ్యాప్తంగా ద చర్చనీయాంశమైన “నీట్” పేపర్ లీకేజీ వివాదం, ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీచార్జ్, అనంతరం కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, మల్లికార్జున ఖర్గేలను అదుపులోకి తీసుకున్న ఘటనలపై బుధవారం డోర్నకల్ మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పసుపులేటి కళావతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాతో మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాల్లో ఆందోళనకు కారణమైందని అన్నారు. ఈ సమస్యకు సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం, విద్యార్థుల గళాన్ని వినకుండా బలప్రయోగానికి దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచిన జాతీయ నాయకులను అదుపులోకి తీసుకోవడం ద్వారా ప్రశ్నించే ప్రతి గొంతును అణచివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దానిని కాలరాయడం సమంజసం కాదన్నారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనపై పారదర్శక దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రజల స్వేచ్ఛ, విద్యార్థుల హక్కులు, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించే దిశగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని పసుపులేటి కళావతి కోరారు.

# రూపాయి విలవిల.. చమురు సలసల

## రెండు నెలల కనిష్ఠానికి రూపాయి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, న్యూఢిల్లీ:**



డాలర్‌తో రూపాయి మారకం రేటు పల్టీలు కొడుతోంది. సోమవారం ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు మరో 6 పైసలు క్షీణించి రూ.96.36 వద్ద ముగిసింది. ఫారెక్స్ మార్కెట్లో సోమవారం ఆరంభంలో 96.53 వద్ద ప్రారంభమైన రూపాయి ఇంట్రాడేలో రూ.96.35–96.53 మధ్య ట్రేడైంది. గత రెండు నెలల్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు ఈ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి. చివరికి 6 పైసల నష్టంతో రూ.96.36 వద్ద ముగిసింది. కాగా వచ్చే కొద్ది రోజుల్లో డాలర్‌తో రూపాయి రూ.96.10 –96.70 మధ్య ట్రేడయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. అమెరికా – ఇరాన్ మధ్య ముదిరిన యుద్ధం, మళ్లీ పెరుగుతున్న చమురు ధర ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో బ్యారల్ ముడి చమురు సోమవారం ఏకంగా 2.69 శాతం పెరిగి 90.47 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా-ఇరాన్ యుద్ధంతో హోర్ముజ్ జలసంధి మళ్లీ మూసుకుపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

# కాంగ్రెస్ కక్షపూరిత రాజకీయం వల్లనే ఎండిపోతున్న రైతన్న పొలాలు

**బిఆర్ఎస్‌పై అక్కసుతోనే పంట పొలాలకు నీళ్లు ఇవ్వకుండా రైతులను ఆగం చేస్తున్న కాంగ్రెస్**

**కల్లూరి రాం చంద్రారెడ్డి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రాజపేట మండలంలోని గొలుసు కట్టు చెరువులు నింపాలని రాజపేట నుండి బేగంపేట వరకు రైతుల పాద యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కల్లూరి రాం చంద్రారెడ్డి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ...?”రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. వర్షాలు పడక, వేసిన మెట్ట పంటలు, వరి పొలాలు కళ్ల ముందే ఎండిపోతుంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం అత్యంత దారుణం.” రైతుల కడుపులు కొట్టే పనిచేయడం అత్యంత దుర్మార్గం ?”మీకు బిఆర్ఎస్ పార్టీపై, కేసీఆర్ పై రాజకీయ కోపం ఉంటే రాజకీయంగా ఎదుర్కొండి. అంతేగానీ, బిఆర్ఎస్‌పై ఉన్న అక్కసుతో, కుళ్ళుతో పంట పొలాలకు నీళ్లు ఇవ్వకుండా రైతులను ఆగం చేయడం ఏ రకమైన పాలన? ఇది రైతుల ఉసురు పోసుకోవడమే!”?”మేడిగడ్డ బ్యారేజీలో కేవలం 3 పిల్లర్లు కుంగాయనే నెపంతో కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను బంద్ పెట్టారు. రిపేర్లు చేసి నీటిని తోడే అవకాశం ఉన్నా... కన్నెపల్లి నుంచి ఒక్క బొట్టు నీటిని కూడా ఎత్తిపోయకుండా గోదావరి జలాలను వృథాగా సముద్రంలోకి వదిలేస్తున్నారు. కన్నెపల్లి, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను ఖాళీగా ఉంచి రిజర్వాయర్లను వెలవెలబోయేలా చేశారు.””’గత సంవత్సరం ఇదే సమయానికి కేసీఆర్ కాళేశ్వరం జలాలతో ఆలేరు నియోజకవర్గంలోని చివరి కాలువ (టైల్ ఎండ్) వరకు నీళ్లు పారాయి, చెరువులు కళకళలాడాయి. కానీ ఈ రోజు ఆలేరు కాలువల్లో నీళ్లు లేక, భూగర్భ జలాలు పడిపోయి, బోర్లు ఎండిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.””’తెలంగాణను ఎడారిగా మార్చిన కాంగ్రెస్ పాలనను తుడిచిపెట్టి, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కోటి ఎకరాలకు నీళ్లిచ్చి తెలంగాణను దేశానికే ‘అన్నపూర్ణ’గా తీర్చిదిద్దింది కేసీఆర్ ఆ పంట సిరులను చూసి తట్టుకోలేకనే ఈ ప్రభుత్వం ఈ రోజు నీళ్లను ఆపేసింది.”

**వెంటనే పంపింగ్ ప్రారంభించాలి..**

కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటి ఎత్తిపోతలను తక్షణమే ప్రారంభించి సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను, తద్వారా కొండపోచమ్మ, బస్వపూర్ రిజర్వాయర్లను నింపాలి.

కాలువల ద్వారా ఆలేరు నియోజకవర్గములోని చెరువులను నింపాలి. గందమల్ల చెరువు ద్వారా నీటిని కిందకి విడుదల చేయాలి“ప్రభుత్వం ఇప్పటికైనా తన పంతాన్ని విడనాడి, రాజకీయాలు పక్కనబెట్టి రైతుల పొలాలకు నీళ్లు ఇవ్వాలి.




లేకపోతే రైతుల తరఫున కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి నీళ్లు సాధించుకునే వరకు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం!” అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సటు తిరుమలేష్, ఎర్రకోకుల జస్వంత్, గుంటి మసూదన్ రెడ్డి, నాగర్తి గోపాల్ రెడ్డి, ఉప్పలయ్య, చింతలపూరి వెంకటారామ్ రెడ్డి, సోమలింగం, బాలకృష్ణ, భోగ హరినాథ్, బిక్షపతి, కరుణాకర్, మధుసూదన్ రెడ్డి, అంబాభాయ్ హర్షవర్ధన్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, యమ్మ భాస్కర్, రాము నాయక్, లక్ష్మణ్ నాయక్, చంద్రమౌళి, వెంకట్ రెడ్డి, సురేష్, దేవుల నాయక్, కుమ్మరి పుల్లయ్య, ఉప్పలయ్య, ధర్మేందర్ సింగ్, చెరుకు కనకయ్య, మైపాల్, ఉపేందర్ సింగ్, రవి, సందుల వెంకటేశ, బొంగోని గోపాల్ గౌడ్, ఎమ్మ ఎల్లయ్య, సతీష్, వెంకటేష్ గౌడ్, ప్రశాంత్, హరినాథం, గొడుగు రాజు తదితరులు పాల్గొన్నారు

# రాజపేటలో కర్గే దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ నాయకులు...


**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిన్న ఏదైతే మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ ఇంటి మీద కాంగ్రెస్ గుండాలు దాడికి ప్రయత్నించారో దానికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున కర్గే దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మేకల రమేష్ మాట్లాడుతూ... మల్లికార్జున కార్గే పుట్టినరోజు నేపథ్యంతో కాంగ్రెస్ నాయకులు విద్రోహ శక్తులను కలుపుకొని కాంగ్రెస్ పార్టీ చేసిన పని దేశద్రోహం అని ఇలాంటి చర్యల వల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లుతదని ఇంకోసారి ఇటువంటి చెర్యలకు పాల్పడితే భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్ కార్యకర్తలకు తగిన బుద్ధి చెపుతాము అని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజి మండల అధ్యక్షులు దాచేపల్లి రాజు, కాసోజు సంపత్, బూర్గు శేఖర్ రెడ్డి, మెండు భగవాన్ రెడ్డి, సాధనబోయిన శంకర్, బిర్రు సురేశ్, సోమసాని చెంద్రమోహన్, రంగ నరేష్, గొడుగు గణేష్, ఐరేణి శ్రీధర్, మెండు మణికుమార్ రెడ్డి, పెంట నాగరాజు, రంగ రామ గౌడ్, ఎండీ కాజ, గాజ ప్రకాష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు



# అక్రమ అరెస్టులతో ఆర్టిజన్ల ఉద్యమాన్ని ఆపలేరు...

**ఆర్టిజన్ భువనగిరి డివిజన్ చైర్మన్ ఇంజ మహేష్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు, బుధవారం రోజు హైదరాబాదులోని, మింట్ కాంపౌండ్, టీజీ ఎస్పీడీసీఎల్ ఆఫీస్ ముందు చేపట్టిన ధర్నా కార్యక్రమానికి.. భువనగిరి డివిజన్ చైర్మన్, ఇంజ మహేష్, ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ.. పది రోజులు సమ్మె చేసిన, మా న్యాయమైన డిమాండ్ల నెరవేరుస్తామని చెప్పిన ప్రభుత్వం మూడు నెలలు కావస్తున్న నెరవేరకపోవడంతో, ఈరోజు హైదరాబాదులో మహాధర్నా నిర్వహించడం జరిగింది. సమ్మె కాలంలో, విద్యుత్ కార్మికులకు ఉప ముఖ్యమంత్రి మరియు విద్యుత్ శాఖ మంత్రివర్యులు భట్టి విక్రమార్క ఇచ్చిన హామీలను విద్యుత్ సంస్థల యాజమాన్యాలు వెంటనే అమలు చేయాలని అన్నారు. చాలామంది ఆర్టిజన్ కార్మికులను హౌస్ అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం యజమాన్యం, స్పందించని పక్షంలో, మా కుటుంబంతో కలిసి ప్రజా భవన్ ముట్టడి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి డివిజన్ కన్వీనర్, బొట్ల రమేష్, కో కన్వీనర్, ఎడ్ల వెంకటేష్, కో కన్వీనర్, హరికృష్ణ, డి భాస్కర్, దేశపాండ భరత్, సందీప్ మరియు ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు



# జంతర్‌మంతర్ లో అందరూ యాంటీ నేషనల్సే : రామచందర్ రావు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, తెలంగాణ బ్యూరో:**
సీజేపీ పేరుతో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్న వారంతా యాంటీ నేషనల్స్, యాంటీ సోషల్ ఎలిమెంట్సే అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు ధ్వజమెత్తారు. సీజేపీ ధర్నాలో నీట్ అభ్యర్థులెవరూ లేరని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో ప్రధాని మోదీ ఇంటి వద్ద రాహుల్ గాంధీ చేపట్టిన ధర్నాకు నిరసనగా రాష్ట్రంలో రామచందర్ రావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు.రాహుల్ గాంధీ, అరవింద్ కేజ్రీవాల్ లాంటి నేతలు దేశాన్ని విడగొట్టేటటువంటి మాటలు మాట్లాడారు. తుక్‌డే తుక్‌డే గ్యాంగ్‌ను చూశాం. ఆ తుక్‌డే గ్యాంగ్ కొత్త పేరు సీజేపీతో ముందుకు రావడం జరిగింది. నీట్ రాసిన వారెవరూ జంతర్ మంతర్ ధర్నాలో లేరు. అక్కడ నిరసన చేపట్టిన వారిలో సగం మందికి నీట్ అంటే ఏంటో తెలియదు. మొత్తం యాంటీ సోషల్, యాంటీ నేషనల్ ఎలిమెంట్స్‌ను జమ చేసి దేశంలో విభజన రాజకీయాలు చేసే ప్రయత్నం చేస్తుంది కాంగ్రెస్. పార్లమెంట్ నడుస్తున్న సమయంలో లోపల మాట్లాడకుండా.. ప్రధాని నివాసం ఇంటి వద్ద ధర్నా చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. నీట్ మీద ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే మీరు ఎందుకు చర్చ రావడం లేదు. మీ దగ్గర మెటీరియల్ లేదు కాబట్టే రావడం లేదు. మీ మెదడులో ఏం లేదు



కాబట్టే రోడ్ల మీద పడి డ్రామా చేస్తున్నారు అని రాహుల్ గాంధీపై రామచందర్ రావు నిప్పులు చెరిగారు.

**సీజేపీ కార్యక్రమంలో దేశ వ్యతిరేక నినాదాలు:**

సీజేపీ కార్యక్రమంలో దేశ వ్యతిరేక నినాదాలు వచ్చాయి. ఆర్టికల్ 370 మళ్లీ ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. చైనా, పాకిస్తాన్‌కు మద్దతు తెలిపే వ్యక్తులు వచ్చారు. గతంలో అన్నా హజారేను ముందు పెట్టే ప్రయత్నం చేశారు. ఇప్పుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను తీసుకొచ్చారు. వాళ్ల తండ్రి కాంగ్రెస్ ఎమ్మెల్యే. ఈయన దేశ వ్యతిరేకంగా మాట్లాడారు. పాక్, చైనాకు సపోర్ట్ చేశారు. సీజేపీకి పూర్తిగా మద్దతు పలుకుతున్నట్లు లేఖ రాశారని రామచందర్ రావు తెలిపారు.

**బంగ్లాదేశ్, నేపాల్‌లో మాదిరిగానే ఢిల్లీలో కూడా**

దేశ వ్యతిరేక శక్తులకు రాహుల్ సపోర్ట్ చేస్తున్నారు. రాహుల్‌కు బుద్ధి లేదంటే మన సీఎంకు కూడా బుద్ధి లేనోళ్లకు సపోర్ట్ చేస్తున్నాడు. ఇవన్నీ దేశ వ్యతిరేక శక్తులు. ప్రధాని ఇంటి వద్ద డ్రామా చేశారు. బంగ్లాదేశ్, నేపాల్‌లో మాదిరిగానే ఢిల్లీలో కూడా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. యువకులు, విద్యార్థులు దేశం కోసం ప్రాణాలు ఇస్తారు. ఇలాంటి విదేశీ తొత్తులకు లొంగరు. విదేశాల నుంచి కోట్లాది రూపాయాలు తీసుకొచ్చి దేశంలో విధ్వంసం సృష్టించడానికి ఈ శక్తులు పని చేస్తున్నాయి. అందులో భాగంగా రాహుల్ విదేశీ మాయలో పడి విదేశీ ఏజెంట్లుగా దేశాన్ని ముక్కలు ముక్కలుగా చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ విధ్వంసం రాజకీయాలకు చరమ గీతం పాడుతాం అని రామచందర్ రావు హెచ్చరించారు.

# 24 గంటల్లో చోరీ కేసును ఛేదించిన రాయికోడ్ పోలీసులు

**నిందితుడిని అరెస్ట్ చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు.**

**కేసును వేగంగా ఛేదించిన అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్. అభినందించారు.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
సంగారెడ్డి జిల్లా రాయికోడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగాపూర్ గ్రామంలో జరిగిన చోరీ కేసును రాయికోడ్ పోలీసులు కేసు నమోదు చేసిన 24 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే తేది 21-07-2026 న రాయికోడ్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన కేసు క్రైం నెం. 87/2026, సెక్షన్లు 331(3), 303(2) బీఎన్ఎస్. సంగాపూర్ గ్రామానికి చెందిన కాలిమొల్ల నాగేష్ తండ్రి సంగయ్య, ఇచ్చిన ఫిర్యాదు మేరకు, 18-07-2026 తేదీన గుర్తు తెలియని వ్యక్తి ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి సుమారు 20 తులాల వెండి పట్టీలు (విలువ రూ. 11,000/-) మరియు శాంసంగ్ మొబైల్ ఫోన్ (విలువ రూ. 25,000/-) మొత్తం ఆస్తి విలువ రూ. 36,000/-. దొంగతనం జరిగినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన రాయికోడ్ ఎస్ఐ చైతన్య కిరణ్ ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక సమాచారంతో పాటు సీసీటీవీ ఫుటేజ్, ఇతర సాక్ష్యాధారాలను సేకరించి వేగవంతంగా దర్యాప్తు చేపట్టి, సంగాపూర్ గ్రామానికి చెందిన మడిగడ్డ బసవరాజ్ ఈ చోరీకి పాల్పడినట్లు నిర్ధారించి, కేసు నమోదు చేసిన 24 గంటల్లోనే నిందితున్ని అరెస్ట్ చేసి, న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ., కేవలం 24 గంటల్లోనే కేసును చేధించి, నిందితున్ని అరెస్ట్ చేసి, జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించిన రాయికోడ్ ఎస్ఐ చైతన్య




కిరణ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. జిల్లా ప్రజలు తమ ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, అలాగే అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని అన్నారు.

## ఆదివాసి విద్యార్థుల ఎదుర్కొంటున్న అవస్థలు చూసి...

# నూతన పాఠశాల నిర్మించిన పోలీస్ శాఖ అధికారులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :**
చర్ల మండలంలోని బక్కచింతలపాడు గ్రామంలో పోలి శాఖ ఆధ్వర్యంలో నూతన పాఠశాల నిర్మించారు. గతంలో ఉన్నటువంటి పాఠశాల విద్యార్థులకు సరైన వసతులు లేక విద్యార్థులు వర్షంలోనే విద్యను అభ్యసిస్తున్న తీరును చూసి చెలించి పోయిన చర్ల సి.ఐ. రాజీ వర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ లు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నూతన పాఠశాల నిర్మించారు. నూతన పాఠశాల ప్రారంభోత్సవానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ పాల్గొని నూతన పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్య ఎంతో అవసరం విద్యుత్ తోనే ఏదైనా సాధించగలమని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. ప్రతి ఒక్కరూ విద్యార్థులను ప్రతిరోజు పాఠశాలకు పంపించాలని విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని పాఠశాలలను నిర్మించి ఇవ్వడం మా వంతు అయితే విద్యార్థులను తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యత అని అన్నారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్ పంపిణీ చేసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం బూరుగుపాడు, బక్కచింతలపాడు గ్రామాల్లో నూతన పాఠశాలను నిర్మించి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన సీఐ రాజువర్మను, డిఎస్పి అరుణ్ కుమార్, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవులను ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో కాళ్లు, చేతులు కోల్పోయిన ఇడమయ్య కు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డి.ఎస్పి అరుణ్ కుమార్, చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి కేశవ్ ఎస్పీ టు ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎం.ఈ.ఓ పరిటాల. వెంకటరమణ, సర్పంచ్ సోడి. లక్ష్మి,





ఉపాధ్యాయురాలు సౌజన్య, జిల్లా కాంగ్రెస్ నాయకుడు సోడి. చలపతి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాంగ విలువలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కుతోంది: కోదాటి వెంకన్న

**హైదరాబాద్ పల్స్, జూలై 22, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన "నీట్" పేపర్ లీకేజీ వ్యవహారం, ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీచార్జ్ ఘటనపై తెలంగాణ ఉద్యమ నాయకులు కోదాటి వెంకన్న తీవ్రంగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని ఆయన విమర్శించారు. బుధవారం డోర్నకల్ మండలం ములకలపల్లి గ్రామంలో మీడియాతో మాట్లాడిన కోదాటి వెంకన్న, భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛ, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని గుర్తు చేశారు. అలాంటి హక్కులను వినియోగిస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్య అని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారని పేర్కొంటూ, ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి పారదర్శక దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించాల్సిన పాలకులు ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదని విమర్శించారు. బీజేపీ పాలనలో రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలుగుతోందని ఆరోపించారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, రాజ్యాంగం సూచించిన మార్గంలోనే పాలన సాగించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించే నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా కేంద్ర



ప్రభుత్వం వ్యవహరించాలని తెలంగాణ ఉద్యమ నాయకులు కోదాటి వెంకన్న పిలుపునిచ్చారు.

# ట్రాఫిక్ ఠాణా కోసం డిజిపికి వినతిపత్రం సమర్పించిన ఎమ్మెల్యేలు

## జహీరాబాద్ టౌన్ ఠాణాను అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి.

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, జహీరాబాద్ :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌ను తక్షణమే అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కి వినతి పత్రాన్ని అందజేశారు. జహీరాబాద్ పట్టణ జనాభా లక్షకు పైగా ఉండటంతో పాటు ఇటీవల ఐదు గ్రామాలు మున్సిపాలిటీలో విలీనమయ్యాయని ఆయన పేర్కొన్నారు. పట్టణం చుట్టుపక్కల అనేక చిన్న, పెద్ద పరిశ్రమలు ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది కార్మికులు ఇక్కడ నివసిస్తూ పనిచేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా జహీరాబాద్ పరిధిలో 78 ప్రభుత్వ పాఠశాలలు, 62 ప్రైవేట్ పాఠశాలలు, 2 ప్రభుత్వ కళాశాలలు, 14 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయని, ప్రతిరోజూ పాఠశాల బస్సులు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రజా రవాణా వాహనాల రాకపోకలు అధికంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను సమర్థవంతంగా నియంత్రించేందుకు జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసి, ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడం అత్యవసరమని ఎమ్మెల్యే తన లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు తన విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి, జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడేషన్‌తో పాటు కొత్త ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని డీజీపీని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు కోరారు. డిజిపిని కలిసిన వారిలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావుతో పాటు సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్, డిసిఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ చైర్మన్ మల్కాపురం శివకుమార్ లు ఉన్నారు.



# స్వాతి నక్షత్రం సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి గిరిప్రదక్షిణ

**శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి గిరిప్రదక్షిణలో కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్ర ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో స్వాతి నక్షత్రం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో కొండ చుట్టూ గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా స్వామివారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వేలాది మంది భక్తులతో కలిసి గిరిప్రదక్షిణ పూర్తి చేసి, కొండపై ఉన్న ప్రధాన ఆలయానికి చేరుకుని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, స్వాతి నక్షత్రం రోజున శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి గిరిప్రదక్షిణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. యాదగిరిగుట్ట దేవస్థానం రాష్ట్రంలోనే అత్యంత ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా మరింత అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకుంటోందని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ గిరిప్రదక్షిణలో ఆంధ్రప్రదేశ్ మాజీ ఎంపీ గొరంట్ల మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ అధికారులు, అర్చకులు, అలాగే వేలాదిమంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ కార్డుకు విలువ లేదు.. జర్నలిస్టుకు అవమానం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డులకు విలువ లేకుండా పోయింది. పోలీసులు జర్నలిస్టుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అయితే ఇంగ్లీష్ డైలీ తెలంగాణ టుడే దినపత్రికకు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ ఆనంద్ ధర్మనకు బల్కంపేట రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద అవమానం జరిగింది. అమ్మవారి దర్శనానికి తరలివస్తున్న భక్తుల ఫొటోల కవరేజీ కోసం వెళ్లిన సదరు ఫొటోగ్రాఫర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. అక్రిడిటేషన్ కార్డు చూపించినప్పటికీ ఆ కార్డుకు విలువ లేదని పోలీసులు తేల్చిచెప్పారు. అక్కడ్నుంచి మెడపట్టి గెంటేసినంత పని చేశారు పోలీసులు. ప్రభుత్వం జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డే కదా..? తమను అనుమతించండి అని అడిగినప్పటికీ పోలీసులు వినిపించుకోలేదు. ఈ ఘటనపై జర్నలిస్టులు మండిపడుతున్నారు. ఇదేమీ అన్యాయం అని నిప్పులు చెరుగుతున్నారు.



# అమీన్‌పూర్‌లో రూ.16.53 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి

**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 22 :**
పటాన్ చెరు నియోజకవర్గంలోని బీరంగూడ, అమీన్‌పూర్ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 16.53 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు అండ్ భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలోని అమీన్‌పూర్ సర్కిల్--47లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీ జి ఎల్ ఎల్ సి చైర్మన్ డీసీసీ ప్రెసిడెంట్ నిర్మల జగ్గారెడ్డి, పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మంత్రితో కలిసి పాల్గొన్నారు. ఈ నిధులతో బీరంగూడ (వార్డు--270), అమీన్‌పూర్ (వార్డు--271) ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ), వర్షపు నీటి కాలువలు, స్మశానవాటిక అభివృద్ధి, సెంట్రల్ మీడియన్ నిర్మాణం తదితర మౌలిక సదుపాయాల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.



Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.